# క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

15 ANNIVERSARY

హైదరాబాద్
14-4-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:15
సంచిక: 9

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# తెలంగాణ కాంగ్రెస్‌లో ముసలం

## జానారెడ్డిపై రాజగోపాల్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

## జానారెడ్డి ఎవడు.. నేనే తోపునంటూ కామెంట్స్

- మంత్రి పదవి ఇవ్వకుంటే ఊరుకునేదిలేదు
- ఒకే ఇంట్లో ఇద్దరికి మంత్రి పదవి ఉంటే తప్పేంటి?
- మంత్రి పదవి అడుక్కోను, గల్లా ఎగరేసుకొని ఉంటా
- కెపాసిటీని బట్టే పదవులు లభిస్తాయి
- జానారెడ్డి 30ఏళ్లు పదవులు అనుభవించారు
- రంగారెడ్డి, హైదరాబాద్ నేతలు ఇప్పుడు గుర్తొచ్చారా?
- ఎమ్మెల్యేగా ఉండి భువనగిరి ఎంపీని గెలిపించా
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో : తెలంగాణ కాంగ్రెస్‌లో ముసలం పుట్టించారు సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. మంత్రి పదవి విషయంలో కొంత కాలంగా హాట్ కామెంట్స్ చేస్తున్న రాజగోపాల్ రెడ్డి మరోసారి సొంత పార్టీ నేతలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ కాంగ్రెస్‌లో అత్యంత సీనియర్ అయిన మాజీ మంత్రి జానారెడ్డిపై రాజగోపాల్‌రెడ్డి ఫైర్ అయ్యారు.

- మిగతా 2వ పేజీలో



## రేవంత్ పాలనలో హైదరాబాద్ ఆగమైంది

- ఎక్కడి సమస్యలు అక్కడే- తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష
- భవిష్యత్‌లో ఏ ఎన్నికలు వచ్చినా.. బీజేపీ.. కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టాల్సిందే
- తెలంగాణపై కేసీఆర్‌కు ఉన్న కడుపు నొప్పి..ప్రేమ ఢిల్లీ పార్టీలకు ఉంటుందా?
- రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం
- సన్నాహక సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మేడ్చల్: భవిష్యత్‌లో ఏ ఎన్నికలు వచ్చినా.. కాంగ్రెస్, బీజేపీలకు కర్రుకాల్చి వాత పెట్టాల్సిందేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరిలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్

2లో

# వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



- వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా భారీ నిరసన
- అంబేద్కర్ విగ్రహం వద్ద ముస్లింల దీక్ష
- హాజరై సంఘీభావం తెలిపిన టీపీసీసీ చీఫ్
- బషీర్‌బాగ్‌లో ముస్లింల ర్యాలీ
- 19న భారీ నిరసన సభ: అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్:వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం హైదరాబాద్‌లో ముస్లింలు భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టం రాజ్యాంగ వ్యతిరేకమంటూ ట్యాంక్‌బండ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. అలాగే లిబర్టీ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నిరసన దీక్షకు

2లో

# నేడు ఎస్సీ వర్గీకరణ ఉత్తర్వులు 'తొలి ప్రతి సీఎంకు'...

- అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని జారీ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఎస్సీ వర్గీకరణ మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి
- 2026లో జనగణన గణాంకాలు అందుబాటులోకొచ్చాక రిజర్వేషన్లు పెంచుతామని స్పష్టీకరణ



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ఉత్తర్వులు విడుదల చేయనుంది. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీకి అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రూపొందించిన మార్గదర్శకాలకు తాజాగా ఎస్సీ వర్గీకరణ మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది.

## 2029 అసెంబ్లీ ఎన్నికల్లో భూభారతే ప్రధానం

- నేడు భూభారతి పోర్టల్‌ను సీఎం ప్రారంభిస్తారు
- 3 జిల్లాల్లోని మూడు మండలాల్లో అమలు
- జూన్ 2 నాటికి రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తెస్తాం
- మీడియాతో ఇష్టాగోష్టిలో మంత్రి పొంగులేటి



2లో

## బతుకులు బుగ్గిపాలు

**అనకాపల్లి జిల్లా కైలాసపట్నంలో ఘోర ప్రమాదం**

- అగ్ని కీలల్లో 8 మంది సజీవ దహనం
- మరో 8 మందికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమం
- విశాఖ, నర్సీపట్నం ఆస్పత్రులకు తరలింపు
- ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా
- రూ.15 లక్షల చొప్పున పరిహారం ప్రకటన
- బాధితుల్ని సత్వరమే ఆదుకోవాలని డిమాండ్



పర్వతాలు పేలినట్టు.. భూమి కంపించినట్టు భారీ విస్ఫోటం.. అగ్నికీలలు ఎగసిపడ్డాయి.. 8 మంది కూలీలు సజీవ దహనం కాగా.. క్షతగాత్రులు దిక్కులు పిక్కటిల్లేలా అరిచిన అరుపులతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. భోజనానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న తరుణంలో అన్నం ముద్ద నోటికి చేరకుండానే ఎనిమిది మంది కూలీలు మరుభూమికి తరలిపోవడం అందరినీ కంటతడి పెట్టించింది.

- మిగతా 2వ పేజీలో



## 16న జపాన్‌కు సీఎం రేవంత్

హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ నెల 16న జపాన్ పర్యటనకు బయ ల్దేరి వెళ్లనున్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో పాటు రాష్ట్ర అధికారుల ప్రతినిధి బృందం సీఎం వెంట ఉంటారు. ఏప్రిల్ 16 నుండి 22 వరకు పర్యటన కొన సాగనుంది.

2లో



# వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

టీపీసీసీ అధ్యక్షుడు మహేషకుమార్ గౌడ్ సంఘీభావం హాజరై సంఘీభావం తెలిపారు. ఎంపీ ఇమ్రాన్ మసూద్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్, టీజీఎంఆర్ఈఐఎస్ చైర్మన్ ఫహీం ఖురేషి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ ఖుస్రూ పాషా, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, షేక్ అక్బర్, ఉస్మాన్ హల్ అజ్రీ తదితరులు పాల్గొన్నారు. వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లింలకు తీవ్ర నష్టం జరుగుతుందని, దాన్ని రద్దు చేయాలని మాజీ ఎంపీ వీ హనుమంతరావు డిమాండ్ చేశారు. కాగా, వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 19న సాయంత్రం ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో దారుల్‌సలాంలో భారీ నిరసన సభ నిర్వహించనున్నట్లు మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బోర్డు అధ్యక్షుడు ఖలీద్ సైఫుల్లా రెహ్మానీ అధ్యక్షతన జరిగే సభలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముస్లిం మత నాయకులు, ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. వక్ఫ్ ఆస్తుల రక్షణ పేరుతో చేసిన చట్టం వక్ఫ్ విలువైన ఆస్తులను ఇతరులకు ధారాదత్తం చేసేలా ఉందని విమర్శించారు. టీటీడీలో హిందువులు తప్ప ఇతర మతస్థులు ఉండరాదని తొలగిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు.. ముస్లింలకు సంబంధించిన ధార్మిక సంస్థలో ఇతర మతస్థులను సభ్యులుగా చేర్చే వక్ఫ్ సవరణ చట్టానికి ఎలా మద్దతు పలుకుతారని ఒవైసీ ప్రశ్నించారు. చంద్రబాబు, నితీశ్ తదితరులు ఈ చట్టానికి మద్దతు ప్రకటించి ముస్లింలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు.



# తెలంగాణ కాంగ్రెస్‌లో ముసలం

(మొదటి పేజీ తరువాయి)

తనకు మంత్రి పదవి ఇస్తే కిరీటం కాదన్నారు. తన లాంటి వ్యక్తి మంత్రి పదవి ఇవ్వాలని పదేపదే అడుగుతుంటే చాలా బాధేస్తోందని రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఒక ఇంట్లో ఇద్దరికి మంత్రి పదవులు ఎలా ఇస్తారని కొందరు మాట్లాడుతున్నారని రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరికి మంత్రి పదవులు ఇస్తే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. ఇండియా క్రికెట్ టీంలో అన్నదమ్ముళ్లు ఉన్నప్పుడు కేబినెట్‌లో ఉంటే ఏమవుతుందని ప్రశ్నించారు. మంత్రి పదవి అనేది అడుక్కుంటే వచ్చేది కాదని, కెపాసిటిని బట్టి వస్తుందని తెలిపారు. తనకు మంత్రి పదవి విషయంలో జానారెడ్డి లాంటి దుర్మార్గులు ధృతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నారని మండిపడ్డారు. రాజగోపాల్ రెడ్డి గల్లా ఎగరేసుకొని ఉంటాడే తప్పా అడుక్కునే పొజిషన్ లో ఉండదని తేల్చి చెప్పారు. 30 ఏళ్లు మంత్రి పదవి అనుభవించిన జానారెడ్డికి రంగారెడ్డి, హైదరాబాద్ ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇవ్వాలని ఇప్పుడు గుర్తుకు వచ్చిందా అని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. మహబూబ్ నగర్, హైదరాబాద్, మెదక్ జిల్లాల్లో ముఖ్యమంత్రికి, మంత్రులకు ఇంచార్జ్ బాధ్యతలు ఇస్తే ఎంపీలను గెలిపించలేదన్నారు. ఒక ఎమ్మెల్యేగా తాను భువనగిరి ఎంపీని గెలిపించి చూపించానని చెప్పారు.

# రేవంత్ పాలనలో హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తయినా.. హైదరాబాద్‌లో ఒక్క అభివృద్ధి పనిని ప్రారంభించలేదన్నారు. తెలంగాణపై కేసీఆర్‌కు ఉన్న కడుపు నొప్పి..ప్రేమ ఢిల్లీ పార్టీలకు ఉంటుందా అని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ నగరంలో 16 సీట్లు గెలిపించి హైదరాబాద్ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకున్నారని చెప్పారు. మంచి నాయకుడు ఉంటే మంచి జరుగుతుందని గుర్తించి.. భవిష్యత్‌లో మోసపోవద్దన్నారు. రేవంత్ పాలనలో హైదరాబాద్ అంతా ఆగమైపోయిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మల్కాజిగిరిలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మోరీల్లో పూడికలు తీయకపోతే మోరీల్లో కూర్చుంటున్నారని, శ్మశానవాటికను డంపింగ్ యార్డ్ చేస్తుంటే డంపింగ్ యార్డ్‌లో కుర్చుంటూ.. ప్రభుత్వాన్ని ప్రజల సమస్యలు పరిష్కరించాలని నిలదీస్తున్నారన్నారు. హైదరాబాద్ అంతటా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, ప్రజలు ఇది గమనించాలన్నారు. సన్నాహక సభకు ఎర్రటి ఎండలో హాజరైన మహిళలకు ధన్యవాదాలని కేటీఆర్ అన్నారు. భారీ సంఖ్యలో తరలివచ్చి కేసీఆర్‌ను ఆశ్వీరదించేందుకు వచ్చిన వారికి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రజతోత్సవ సన్నాహక భకు భారీ సంఖ్యలో తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులకు ధన్యావాదాలు తెలిపారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు. కేటీఆర్ సమక్షంలో జరిగిన సన్నాహక సభలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల నేతలు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి గులాబీ కండువాలు వేసి కేటీఆర్ బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబిత కిశోర్, సునీతా రాముయాదవ్, మాజీ కార్పొరేటర్లు జగదీశ్‌గౌడ్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సన్నాహక సభకు భారీగా బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేశారు. వేలాది సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు జై కేటీఆర్ కేటీఆర్ అంటూ నినాదాలు చేశారు. కేటీఆర్‌తో ఫోటోలు దిగేందుకు పోటీలు పడ్డారు. గ్రేటర్ బీఆర్ఎస్‌లో రజతోత్సవ సంబురాలు అంబరాన్నంటుతున్నాయి. బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో భారీ బహిరంగ సభకు శ్రేణులు సమాయాత్తమవుతున్నారు. ఈ వేడుకను ప్రతి కార్యకర్త ఇంట్లో పండుగ వాతావరణంలో జరుపుకునేలా భారీ ఎత్తున ప్లాన్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 8న తెలంగాణ భవన్‌లో పార్టీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, పార్టీ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో రజతోత్సవ సభ విజయవంతం చేసేలా దిశానిర్దేశం చేశారు. ఒక్కో నియోజకవర్గం నుంచి 3వేల మంది సభకు వెళ్లేలా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశారు. నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చడానికి బీఆర్ఎస్ పార్టీని స్థాపించి అనేక పోరాటాలు చేసి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ గొప్ప పరిపాలనాదక్షుడని సన్నాహక సమావేశంలో నేతలు చెబుతున్నారు. ఉద్యమసారథియే తెలంగాణ మొదటి సీఎంగా ఉండటం వల్ల తెలంగాణ అభివృద్ధి వేగంగా జరిగిందని కొనియాడారు. ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ వ్యవస్థాపక పండుగ తమ ఇంట్లో పండుగగా ప్రతి ఒక్క కార్యకర్త భావిస్తున్నట్టు పేర్కొంటున్నారు.

# 16న జపాన్‌కు సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

టోక్యో, మౌంట్ ఫుజి, ఓసాకా, హీరోషిమాలో ముఖ్యమంత్రి బృందం పర్యటించనుంది. ఓసాకా వరల్డ్ ఎక్స్‌పో%-%2025లో తెలంగాణ పెవిలియన్‌ను సీఎం ప్రారంభించనున్నారు. ఆ దేశానికి చెందిన ప్రముఖ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, పలువురు ప్రతిని ధులతో ముఖ్యమంత్రి బృందం సమావేశం కానుంది. రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రా మిక, సాంకేతిక సహకారంపై ప్రధానంగా చర్చలు జరపనుంది.

# 2029 అసెంబ్లీ ఎన్నికల్లో భూభారతే ప్రధానం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: వచ్చే 2029 శాసనసభ ఎన్నికలకు భూభారతి చట్టం, పోర్టల్‌ను రెఫరెండంగా స్వీకరిస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పునరుద్ఘాటించారు. భూములున్న ప్రతి ఒక్కరికి భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా 'భూ భారతి'చట్టాన్ని, పోర్టల్‌ను తెస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భూభారతి చట్టాన్ని, పోర్టల్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. ఆదివారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. సోమవారం నుంచే భూభారతి పోర్టల్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఇకపై ధరణి పోర్టల్ ఉండదని తెలిపారు. భూ భారతి అమలులోకి వచ్చిన తర్వాత ధరణి ముసుగులో జరిగిన భూ అక్రమా లపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని చెప్పారు. పోర్టల్ ప్రారంభం కాగానే ప్రజలంతా ఒకేసారి దానిని సందర్శించవద్దని, అలా చేస్తే పోర్టల్ ఆగిపోయే ప్రమాదం ఉందని మంత్రి చెప్పారు. కొంతమంది ఉద్దేశ పూర్వకంగా పోర్టల్‌ను నిలుపుదల చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

**తొలుత 3 మండలాల్లో భూభారతి**

భూభారతి చట్టాన్ని, పోర్టల్‌ను తొలుత మూడు జిల్లాల్లోని మూడు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయబోతు న్నట్లు పొంగులేటి తెలిపారు. ధరణిలో తలెత్తిన సమస్యలు భూభారతిలో రాకుండా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అచ్చుతప్పులు, భూ విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు, తండ్రి పేరు మార్పు, భూ లావా దేవీల్లో అవకతవకలను సరిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ మూడు మండలాల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా జూన్ 2వ తేదీ నాటికి రాష్ట్రమంతా ఈ చట్టాన్ని అమలు చేస్తామని చెప్పారు. ధరణిని తెచ్చిన సమయంలో దాదాపు 4 నెలల పాటు రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని, ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదని తెలిపారు. పార్ట్ బీలోని భూముల సమస్యలు



పరిష్కరిస్తామని చెప్పారు. ధరణిలో 33 మాడ్యూల్స్ ఉండగా, భూభారతిలో 6 మాత్రమే ఉంటాయని వెల్లడించారు. భూభారతి అమలు కోసం ఎంపికచేసిన గ్రామాల్లో అవగాహనా సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. భూభారతిలో ఎమ్మార్వో స్థాయి నుంచి సీసీఎల్ఏ వరకు ఐదు స్థాయిల్లో భూ సమస్యల పరిష్కారానికి వీలుగా అధికారాల వికేంద్రీకరణ చేసినట్లు వివరించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల సంఖ్య ఆధారంగా ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

**మే మొదటివారంలో గ్రామ పాలనాధికారులు**

వచ్చేనెల మొదటివారంలో గ్రామాల్లో రెవెన్యూ పాలనా యంత్రాంగాన్ని పునరుద్ధరిస్తామని పొంగులేటి తెలిపారు. ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభించినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా వేయి మంది లైసెన్సుడ్ సర్వేయర్లను నియమిస్తామని మంత్రి ప్రకటించారు.

## నేడు ఎస్సీ వర్గీకరణ ఉత్తర్వులు

## 'తొలి ప్రతి సీఎంకు'...

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో భాగంగా సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది. ఉత్తర్వుల తొలి ప్రతిని సీఎం రేవంత్‌రెడ్డికి అందించనున్నట్లు ఎస్సీ వర్గీకరణ మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం సచివాలయంలో కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ వైస్ చైర్మన్, మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ఏకసభ్య కమిషన్‌కు నేతృత్వం వహించిన జస్టిస్ షమీమ్ అక్తర్, ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్, న్యాయ కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ అంశాన్ని నెరవేర్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మద్దతుతో వర్గీకరణ ప్రక్రియ వేగంగా పూర్తయిందన్నారు. ఎస్సీ వర్గీకరణలో క్రీమీలేయర్ ప్రవేశపెట్టాలన్న కమిషన్ సిఫార్సును ఉపసంఘం తిరస్కరించిందన్నారు. ఆర్థిక ప్రమాణాల ఆధారంగా ఏ ఉప సమూహాన్ని మినహాయించకుండా సమాన ప్రయోజనాలను నిర్ధారించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న ఏ ప్రయోజనాలను నీరుగార్చబోమని.. ఎస్సీ వర్గాల హక్కులను కాపాడుతూ న్యాయాన్ని పెంపొందించడానికే వర్గీకరణ రూపొందించామని వివరించారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీలకు ప్రస్తుతం 15% రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయని.. రాష్ట్రంలో ఎస్సీ జనాభా దాదాపు 17.5 శాతానికి పెరిగిందన్నారు. 2026లో జనగణన గణాంకాలు అందుబాటులోకి వచ్చాక ఎస్సీ రిజర్వేషన్లను పెంచుతామన్నారు.

# బతుకులు బుగ్గిపాలు

విశాఖపట్నం/అమరావతి: అనకాపల్లి జిల్లా కోటరవుట్ల మండలం కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో ఆదివారం మధ్నాహ్నం భారీ విస్ఫోటం సంభవించింది. ఈ ఘోర ప్రమాదంలో శరీరాలు ఛిద్రమై 8 మంది అక్కడికక్కడే మరణించారు. మరో 8మంది తీవ్రంగా గాయపడగా.. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కాలిన గాయాలతో బాధితులు హాహాకారాలు చేయగా.. ఒక వ్యక్తి తల లేకుండా కేవలం మొండెంతో దర్శనమిచ్చి భీతిగొల్పే హృదయ విదారక దృశ్యాలు కనిపించాయి. కైలాసపట్నం సమీపంలోని విజయలక్ష్మి ఫైర్ వర్క్స్‌లో సంభవించిన ఈ ఘోర ప్రమాదం అగ్నిమాపక సిబ్బంది 4 గంటలుకుపైగా శ్రమిస్తే తప్ప మంటలు అదుపులోకి రాలేదు. క్షతగాత్రుల్లో ఆరుగురిని మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించగా.. మరో ఇద్దరికి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని, క్షతగాత్రుల వైద్యానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని హోం మంత్రి వి.అనిత ప్రకటించారు. ప్రమాదంలో కైలాసపట్నం గ్రామానికి చెందిన వారితోపాటు అనకాపల్లి జిల్లా రాజుపేట, చౌడువాడ, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం ప్రాంతాలకు చెందిన 8 మంది మృత్యువాత పడ్డారు. మృతుల్లో విజయలక్ష్మి ఫైర్ వర్క్స్ యజమాని తాతబ్బాయి కూడా ఉన్నారు. భోజన విరామం తీసుకుందామనుకునే సయమంలో మనోహర్ అనే వ్యక్తి బాణసంచాకు ఉపయోగించే ముడి సరుకును వేగంగా దంచడం మొదలుపెట్టాడు. ఎక్కువ బలం ఉపయోగించి దంచడం వల్ల అధిక ఉష్ణోగ్రత ఉత్పత్తి అయ్యి మంటలు చెలరేగినట్టు.. ఆ రేణువులు వారం రోజులపాటు తయారుచేసిన మందుగుండు సామగ్రిపై పడటంతో భారీ ప్రమాదం వాటిల్లినట్టు తెలుస్తోంది. భారీ పేలుడు సంభవించడంతో భూమి అదిరింది. ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయాయని కైలాసపట్నం గ్రామ ప్రజలు మొదట్లో భావించారు. అగ్నికీలలు ఎగసిపడటంతో హుటాహుటిన ప్రమాద స్థలానికి తరలివచ్చారు. సాధారణంగా ఈ కేంద్రంలో నిత్యం 20 నుంచి 30 మంది వరకూ పనిచేస్తుంటారు. ఆదివారం కావడంతో ప్రమాదం జరిగిన సమయంలో కేవలం 16 మంది మాత్రమే పనిచేస్తున్నారు. లేదంటే బాధితుల సంఖ్య మరింత పెరిగేదని గ్రామస్తులు చెబుతున్నారు. మధ్యాహ్నం 12.45 గంటలకు ప్రమాదం జరగ్గా.. ఒంటిగంట సమయంలో వరహాలు అనే వ్యక్తి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. నర్సీపట్నం, నక్కపల్లి, యలమంచిలి ఫైర్‌స్టేషన్ల నుంచి ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. మంటల్ని నిలువరించేందుకు 4 గంటలకుపైగా సమయం పట్టింది.

మందుగుండు సామగ్రి దంచుతున్న మనోహర్ అనే వ్యక్తి తల, కుడి చేయి ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. భారీ పేలుడుకు తల, కుడి చేయి ఎగిరిపోయినట్టు తెలుస్తోంది. మిగిలిన ఏడుగురి శరీరాలు ముక్కలై పూర్తిగా కాలిపోయాయి. గతంలో ఇక్కడి బాణసంచా తయారీ కేంద్రం పాయకురావుపేట నియోజకువర్గం ఎస్.రాయవరంలోని గోకులపాడులో ఉండేది. అక్కడ 2015 మార్చి 29న పేలుడు సంభవించడంతో ఆ ప్రమాదంలోనూ 8 మంది మరణించారు. అనంతరం దీనిని మూసివేశారు.

**సీఎం చంద్రబాబు ఆరా**

బాణసంచా తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదంపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీ, హోంమంత్రి అనితతో ఫోన్‌లో మాట్లాడారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామన్నారు. ఘటనపై విచారణ జరిపి నివేదిక అందించాలని ఆదేశించారు. కాగా.. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్.. హోం మంత్రి అనితతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. అధికార యంత్రాంగం సత్వరమే స్పందించిందని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేలుడు ఘటనలో బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కోరారు.

**మాజీ సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి**

బాణసంచా తయారీ కేంద్రంలో విస్ఫోటం సంభవించడంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో 8 మంది మరణించడం, మరో 8మంది తీవ్రంగా గాయపడటం విచారకరమన్నారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మరణించిన, గాయపడ్డ వారి కుటుంబాలకు తోడుగా నిలవాలని వైఎస్సార్‌సీపీ నాయకులను ఆదేశించడంతో వారు సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నారు. క్షతగాత్రులకు మంచి వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలు తిరిగి కోలుకునేలా అన్నిరకాలుగా ఆదుకోవాలని వైఎస్ జగన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలి**

బాణసంచా పేలుడులో మృతి చెందిన కూలీల కుటుంబాలకు తక్షణమే రూ.కోటి చొప్పున, క్షతగాత్రులకు రూ.50 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించాలని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు డిమాండ్ చేశారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన పరామర్శించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళన




**గుండాల క్రైమ్ మిర్రర్:యాదాద్రి భువనగిరి జిల్లా:** గుండాల మండలంలోని సీతారాంపురం గ్రామంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992 -93 విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మాట్లాడుతూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఐదు కిలోమీటర్ల దూరం నుండి కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నడుచుకుంటూ వచ్చి ఈ స్కూల్లో చదువుకొని పోయేవారి వారిని అని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వాహనాలు ఉన్నాయి కానీ ఆ రోజుల్లో కనీసం ఒక సైకిల్ కూడా లేని పరిస్థితుల్లో అయినా కూడా మేము ఇక్కడికి వచ్చి చదువుకున్నాం. వనమోజు శ్రీధర్ మాట్లాడుతూ మాకు గురువులే దేవుళ్ళు అని కొనియాడారు. విద్య నేర్పించిన గురువులుకు సన్మాన కార్యక్రమం చేశారు. ఆనాటి విద్యార్థులందరూ వారి యొక్క కుటుంబ పరిస్థితులను పిల్లల గురించి చెప్పుకుని చాలా ఎంజాయ్ చేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెండెం సత్యనారాయణ, పిఈటి బ్రహ్మాచారి, వనమోజు నరసింహాచారి, సుంచు వెంకటాచలం, పడకంటి కుందయ, మల్లిపెద్ది సత్తిరెడ్డి, హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు వనమోజు శ్రీధర్ శశిధర్ రెడ్డి పరిశరాములు శ్రీనివాస్ రెడ్డి చంద్రగిరి బాలు కాలి మల్లయ్య జిలేంద్ర రెడ్డి నరసింహులు కొండల్రెడ్డి రాజిరెడ్డి మంగమ్మ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.



# స్నేహితురాలి కూతురు వివాహ వేడుకల్లో 97-98 బ్యాచ్ సభ్యులు

**సంస్థాన్ నారాయణపూర్,ఏప్రిల్ 13(క్రైమ్ మిర్రర్ ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల కొత్తగూడెం గ్రామానికి చెందిన బాలగోని అలివేలు- శీను గౌడ్ ల ఏకైక పుత్రిక నికిత- వంశి గౌడ్ ల వివాహము రిక్కల సత్తిరెడ్డి గార్డెన్స్ లో వారి వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన 97-98 ఎస్ ఎస్ సి బ్యాచ్ సభ్యులు. ఈ కార్యక్రమంలో ఉప్పల వెంకటేష్, నీళ్ల శ్రీశైలం గౌడ్, తెలంగాణ బిక్షం, రాసాల రమేష్, దోనూరి ప్రభాకర్ రెడ్డి, బోయిని వెంకటేష్, చిత్తలూరి వెంకన్న, శికిల మేట్ల శ్రవణ్, గంజి ఉమాకాంత్, ఎడ్ల మల్లేష్, సోమయ్య,చంద్రకళ, నవనీత, కృష్ణవేణి, శోభారాణి, నిర్మల, మాధవి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.




# బిందేశ్వరి మండల్ అవార్డు కు ఎంపికైన సుర్వి యాదయ్య గౌడ్

సంస్థాన్ నారాయణపూర్, ఏప్రిల్ 13(క్రైమ్ మిర్రర్): హైదరాబాద్ బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో యాదవ రాజాధికార సాధన సమితి ఆధ్వర్యంలో బిందేశ్వరి మండల్ అవార్డు గ్రహీతగా తెలంగాణ సర్పంచ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్య గౌడ్ అవార్డుకు ఎంపికయ్యారు.ఈ అవార్డు బీపీ మండల్ మనుమడు సూరత్ మండల్,ఆంధ్రప్రదేశ్ బీసీ వై పార్టీ వ్యవస్థాపకుడు బోడ రామచంద్రయ్య యాదవ్, ఎంపీ ఆర్ కిష్టయ్య యాదవ్ రాజ్యాధికార వ్యవస్థాపక అధ్యక్షుడు బడుగుల నాగార్జున యాదవ్ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ పల్లెటూరు నుండి పట్టణం వచ్చి సర్పంచుల పెండింగ్ బిల్లులు ఇవ్వాలని ముఖ్యమంత్రి నీ మంత్రులను అధికారులను పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ నుంచి అనేకమంది ఐఏఎస్ లను కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది.ప్రభుత్వం స్పందిస్తలేదని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ని రాష్ట్ర ఎన్నికల కమిషనర్లను కలిసి పెండింగ్ బిల్లులు చెల్లించిన అంకె ఎన్నికలు నిర్వహించాలని పలుమార్లు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా తెలంగాణ అమరవీరుల స్తూపం గన్ పార్క్ కాడ 2000 మంది సర్పంచ్లతో నిరసన తెలపడం జరిగింది. రెండుసార్లు చలో సెక్రటేరియట్ ఆందోళన కార్యక్రమంలో దిగడం జరిగింది. మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం పనిచేసిన గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు అందజేయడం జరిగింది. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి మొక్కులు చెల్లిస్తే ప్రజాప్రతినిధుల్లో మార్పు వస్తది ప్రభుత్వానికి అన్ని దేవాలయం అంటూ ముఖ్యమంత్రి నిరసన తెలపాలని కార్యక్రమం చేస్తే అరెస్టు చేయడం జరిగింది. ఎన్నో రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నాం అందుకే అవార్డు ఎంపిక చేశారు అని అన్నారు.




# గుమ్మడవెల్లి వివోఏ గా రజనీ ఎంపిక

**క్రైమ్ మిర్రర్ మద్దిరాల:** మద్దిరాల మండలం గుమ్మడవెల్లి గ్రామం ఇందిరా క్రాంతి పథకం వివోఎ గా అండెం రజని నీ ఎంపిక చేసినట్టు సీసీ నాగార్జున తెలిపారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అందరి సహకారంతో సంగబంధమును సాఫీగా కొన సాగుటకు సహకరిస్తానని, ఎన్నికకు సహకరించిన సంఘ సభ్యులకు గ్రామ పెద్దలకు, ఏపీఎం సీసీలకు కృతజ్ఞత తెలిపారు.

# ప్లీజ్ ఇంకొక్క అవకాశం అని వేడుకుంటున్న యువత

మాడ్గుల, ఏప్రిల్ 13 (క్రైమ్ మిర్రర్):కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి,వ్యవసాయ అనుబంధ రంగాలకు తోడ్పాటు అందించాలని,నిరుద్యోగ యువత శక్తిసామర్థ్యాలు దేశ సంపద సృష్టించడానికి ఉపయోగపడాలని రాజీవ్ యువ వికాసంతో ఆయా కుటుంబాలలో వెలుగులు నింపాలనే సీఎం రేవంత్ రెడ్డి,ప్రభుత్వ ఆలోచనలకు, మాడుగుల మండలం నుండి సుమారు 500 మంది ఆశావహులు రాజీవ్ యువ వికాసంలో నమోదు చేసుకోగా, సర్వర్ మొరాయించడంతో 1000 మంది పైచిలుకు ఆశావహులు ప్రభుత్వ నిర్ణయంకోసం,గడువు పెంచేందుకు యువత ఎదురుచూస్తున్నట్లు తెలుస్తుంది.గత నెల17న రాజీవ్ యూవ వికాస పథకాన్ని ప్రారంభించి 18 నుండి ఈ నెల 4 వరకు ఆన్లైన్ లో అప్లై చేసుకోవాలని ప్రభుత్వం సూచించగా సెలవులు తదితర కారణాలవల్ల ఈనెల 14వరకు ప్రభుత్వం పొడిగించడం సభబె.ఆశాహులు ఆన్లైన్ నిర్వాహకుల చుట్టూ తిరుగుతున్న 9వ తారీకు నుంచి సర్వర్ అడప దడప మొరాయిస్తున్నాయని ఆన్లైన్ నిర్వాహకులు సెలవిస్తున్నారు. ప్రభుత్వం పెద్ద మనసుతో మరికొంత సమయం ఇవ్వాలని యువత ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# అపూర్వంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. 2012-13 బ్యాచ్కు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని గురువులను ఘనంగా సన్మానించి గౌరవించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ కనిపించారు. దీంతో పాఠశాల మొత్తం సందడి వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నరేందర్, తిరుపతి, శివారెడ్డి, మల్లేష్, సోనియా, రాధిక, మాధవి, అశ్విని, సంతోష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

**గండిపేట్, (క్రైమ్ మిర్రర్)**







# విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం


**చిట్యాల క్రైమ్ మిర్రర్:**గత ఫిబ్రవరి నెలలో 5 వ తరగతి కి నిర్వహించిన గురుకులం ప్రవేశ పరీక్షలో విపంచి ఫౌండేషన్ ద్వారా గుండ్రాంపల్లి,బోయగుబ్బ ,వెల్లంకి తుమ్మల గూడెం,బ్రాహ్మణ వెల్లెంల గ్రామాలలో నిరుపేద విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ మరియు ఉచిత ఆన్లైన్ కోచింగ్ 40 రోజులపాటు ఇవ్వడం ఇవ్వడం జరిగింది. ఈ ప్రవేశ పరీక్షలో 16 మంది విద్యార్థులు వివిధ గురుకులాలలో సీట్లు పొందడం జరిగింది ..ఈ సందర్భంగా గురుకులం లో సీట్లు పొందిన విద్యార్థులకు గుండ్రాంపల్లి లోని విపంచి ఫౌండేషన్ కార్యాలయం లో సీట్లు పొందిన విద్యార్థులకు డిక్షనరీలు ఫౌండేషన్ ఛైర్మన్ అనుముల శ్రీనివాస్ అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఛైర్మన్ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు సరియయిన విద్యా వసతులు అందించే ప్రయత్నం లో బాగంగా నిరుపేద విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ ఇవ్వడం జరిగిందని 40 రోజుల పాటు ఉచిత ఆన్లైన్ కోచింగ్ ఇవ్వడం ద్వారా 16 మంది విద్యార్థులు సీట్లు పొందడం సంతోశమని అన్నారు . ఇంకా ఈ కార్యక్రమం లో నకిరేకంటి సతీశ్ ,పబ్బతి సిద్దార్థ ,టి. మానస ,సయ్యద్ అమీషా ,యం నిఖిత విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు .

# రాజీవ్ యువ వికాసం దరఖాస్తు గడువు పెంచాలి- బూడిద సురేష్



**నల్లగొండ(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కోసం ప్రవేశపెట్టిన, రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు గడువు తేదీని పెంచాలని, గత వారం రోజుల నుండి నిరుద్యోగ యువత ఆన్లైన్ సెంటర్, మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగుతూ, అప్లికేషన్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల, వరుసగా మూడు రోజులు ప్రభుత్వ సెలవు దినాలు రావడంతో, చాలామంది నిరుద్యోగులు యువకులు దరఖాస్తులు చేసుకోలేక పోయినందున, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని నిరుద్యోగ యువతకు మరో అవకాశం ఇవ్వాలని ఏఐవైఎఫ్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు బూడిద సురేష్ జిల్లా ప్రభుత్వాన్ని గడువు పెంచాలని డిమాండ్ చేశారు..

# మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గా ఎన్నికైన లోడే రఘు, బిచ్యా నాయక్ ని సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**సంస్థాన్ నారాయణపూర్, ఏప్రిల్13(క్రైమ్ మిర్రర్):** చండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా నియమితులై ప్రమాణ స్వీకారం చేసిన యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల జనగాం గ్రామం చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లోడే రఘు, మెగావత్ బిచ్యా నాయక్ ని భారీ గజ మాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గడ్డం రవి,మాజీ ఎంపిటిసి సభ్యులు బెల్లంకొండ శంకరయ్య,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు షేక్ కైసర్,మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు గడ్డం యాదయ్య,కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా నాయకులు మహ్మద్ కాలేక్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం మల్లయ్య ,ఎర్ర లక్ష్మయ్య,గొందిగళ్ళ యాదయ్య, తొలుపూరి యాదగిరి,శనిగల సైదులు, మాజీ వార్డు సభ్యులు మంచాల ఏసు,మంచాల దశరథ,నాతి నరేష్ గౌడ్,మండల యువజన కాంగ్రెస్ నాయకులు నాతి లక్ష్మణ్ గౌడ్,భైకానీ కృష్ణ,జక్కల మల్లేష్,బొంగు నవీన్,అన్నమోని శివ,భువనగిరి ఫేరోజ్ భాయ్,భిక్షం,తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనమంటే దాడి

**రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట న్యాయం కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తుల నిరసన**

**పూర్తి విచారణ హామీతో ఆందోళన విరమణ**

**సీసీ ఫుటేజీ ఆధారంగా చర్యలు తీసుకుంటామన్న పోలీసులు**





క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ: మిర్యాలగూడ మండలం భాదలాపురం శివారులోని సూర్యతేజ రైస్ మిల్లులో ధాన్యం విక్రయించేందుకు వెళ్లిన రైతులపై మిల్లు యాజమాన్యం దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. కాగా సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, బాధితులపై దాడి చేశారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్తులు, బాధిత రైతులు ఆదివారం రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. శనివారం జరిగిన ఈ ఘటనలో రైతులు శివనేని నాగరాజు, సైదులు తదితరులు ధాన్యం అమ్మకానికి మిల్లు వద్దకు వెళ్లగా, "ధాన్యం కొనలేము" అనే సమాధానంతో నిరాకరించిన మిల్లుయజమానులు రంగనాథ్, విజయసాయిరెడ్డి, మిల్లు గుమస్తాలు, ఇతరులు రైతులపై దాడి చేశారని బాధితులు పేర్కొన్నారు. అనంతరం అక్కడికి చేరుకున్న రూరల్ పోలీసులు రైతులతో చర్చించకుండా వారినే లక్ష్యంగా చేసుకుని దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చాయి. ఈ దాడిలో నాగరాజు తీవ్రంగా గాయపడి ప్రస్తుతం మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, ఆదివారం బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట చేరి ఆందోళనకు దిగారు. పోలీస్ స్టేషన్ గేటు ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉద్రిక్తత నెలకొన్నది. స్థానానికి చేరుకున్న రూరల్ సీఐ పిఎన్.డి ప్రసాద్, ఒన్ టౌన్ సీఐ మోతిరామ్ లు ఆందోళనకారులతో చర్చలు జరిపారు. సంఘటనా స్థలంలోని సీసీ కెమెరా ఫుటేజ్ పరిశీలించి, పూర్తి స్థాయిలో విచారణ జరిపించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



## సన్న బియ్యం పథకం దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది

క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ: సమాజంలో ప్రతి పేదవాడు కడుపునిండా భోజనం చేయాలనే మహాత్మ సంకల్పంతో ముందుకు తీసుకొస్తున్న సన్న బియ్యం పథకం దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది. ఈ పథకం కింద పలు గ్రామాలలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ఇటీవల నల్గొండ జిల్లా, మిర్యాలగూడ మండలానికి చెందిన తుంగపహాడ్ గ్రామంలో ఈ పథకాన్ని అమలు చేశారు. శనివారం, స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి , శాసనమండలి సభ్యులు కేతావత్ శంకర్ నాయక్ ఆదేశాల మేరకు హరిజనవాడలోని రెమడల శ్రీను, పీరమ్మ దంపతుల ఇంట్లో ప్రతి పేదవాడికీ కడుపునిండిన భోజనం అందించాలనే నిశ్చయంతో సన్న బియ్యం వండించి, గ్రామ ప్రజలందరూ కలిసి అందులో భాగమయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బెద్దూరి వెంకట్ రెడ్డి, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కంచుగంట్ల లింగయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ బలరాం నాయక్, మండల కాంగ్రెస్ నాయకులు మచ్చ వెంకన్న, సుధీరెడ్డి శేఖర్ రెడ్డి, సజ్జల అనంతరెడ్డి, గాలి సత్యనారాయణ రెడ్డి, సజ్జల గోపిరెడ్డి, ఆశీర్వాదం, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ సెక్రటరీ షేక్ జాను, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దామరచర్లలో ఉచిత గుండె, గ్యాస్ట్రో మెగా హెల్త్ క్యాంప్

**ప్రతి గ్రామాన ఉచిత క్యాంపులు ఏర్పాటు చేయనున్న జ్యోతి హాస్పిటల్**



క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ: దామరచర్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మిర్యాలగూడ జ్యోతి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు ఆదివారం నిర్వహించారు. హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ మువ్వా రామారావు నేతృత్వంలో ఈ క్యాంపులో గుండె సంబంధిత వ్యాధులు, గ్యాస్ట్రో ఎంటరాలజీ సేవలు అందించబడ్డాయి. ఈ సందర్భంగా డాక్టర్ రామారావు మాట్లాడుతూ, "మాకు 29 సంవత్సరాల వైద్య అనుభవం ఉంది. మిర్యాలగూడలో జ్యోతి హాస్పిటల్ ద్వారా గుండె,గ్యాస్ట్రో చికిత్సలను అందించగలగడం గర్వంగా ఉంది," అని పేర్కొన్నారు. ఆయన్ను అనుసరించి, ఆరోగ్య శ్రీ మరియు తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి పూర్తిగా ఉచితంగా ఆపరేషన్లు చేయబడతాయని తెలిపారు. అలాగే ప్రతి గ్రామంలో ఇటువంటి ఉచిత ఆరోగ్య క్యాంపులను నిర్వహిస్తూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మువ్వా శ్రీహర్ష, డాక్టర్ వెంకటేష్, సుభాష్ చంద్రబోస్,ఫిరోజ్, ఖాసిం, ఆసిఫ్, కాజా తదితరులు పాల్గొన్నారు.

## రాజమ్మ త్వరగా కోలుకోవాలి.. బాధిత కుటుంబాన్ని పరామర్శ

**గుమ్మడిదల గ్రామ మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి**

**పదివేల రూపాయల ఆర్థిక సహాయం..**

క్రైమ్ మిర్రర్ పటాన్ చెరు ప్రతినిధి : గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన సపాయి కార్మికురాలు రాజమ్మ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విషాన్ని తెలుసుకున్న గుమ్మడిదల గ్రామ మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి స్థానిక నాయకులు మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి బాధిత కార్మికురాలు కుటుంబాన్ని పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10,000 ఆర్థిక సహాయం అందించారు. రాజమ్మ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, తగిన సాయం అందించేందుకు అందరూ ముందుకు రావాలని వారు ప్రజలను కోరారు. ఆయనతోపాటు సిజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కుమార్ గౌడ్, నాయకులు కాలకంటి బాల్రెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.



## అన్ని వర్గాల వారికి సామాజిక న్యాయం చేసేది బిజెపి పార్టీనే

**బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు చికోటి ప్రవీణ్ కుమార్**





కోదాడ : ఏప్రిల్ 13 (క్రీమ్ మిర్రర్): ఏప్రిల్ 14 న జరగబోయే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ముందస్తుగా ఆదివారం కోదాడ పట్టణంలో వెంకటేశ్వర థియేటర్ నందు అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు చీకోటి ప్రవీణ్, సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే రామచంద్ర లు మాట్లాడుతూ. సామాజిక న్యాయం బిజెపి పార్టీతోనే డాక్టర్ బి అంబేద్కర్ కి భారతరత్న అలాగే ఎస్సీ వర్గీకరణ ఎస్సీ పేదల సంక్షేమం నిరంతరం పోరాటయోధుడు కారణజన్ముడనీ అన్నారు. మోడీ నాయకత్వంలో భారతదేశం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. ఇట్టి కార్యక్రమానికి బిజెపి పార్టీ నాయకులు జల్లా జనార్ధన్ రావు, మల్లబోయిన వెంకటేష్ బాబు, ఓరుగంటి పురుషోత్తం, వంగవీటి శీను, యధా రమేష్,ఓరుగంటి కిట్టు, కనగాల వెంకట్రావు, కనగాల నారాయణ రావు, నూనే సులోచన, యశ్వంత్, బొలిశెట్టి కృష్ణ, గోదేశీ లక్ష్మణ్, సాతులూరి హనుమంతరావు, కొండ్ల రవి, మరియు నియోజకవర్గ మండలాల అధ్యక్షులు కార్యకర్తలు తదితర బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

**చైర్మన్ గా ఉబ్బు వెంకటయ్య...వైస్ చైర్మన్ గా ఆకుల ఇంద్రసేనా రెడ్డి**

**ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు, డిసిసిబి చైర్మన్**

**పదవి అనేది అలంకారం కాదు ఒక బాధ్యత: మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**





చౌటుప్పల్, క్రైమ్ మిర్రర్: యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరై మాట్లాడుతూ... పదవి అనేది అలంకారం కాదు ఒక బాధ్యతని, ఆ బాధ్యతను గుర్తించి ప్రజలకు మంచి చేయాలని అన్నారు. రాబోయే రోజుల్లో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ పరిధిని మరింత విస్తరించి రైతులకు ఇంకా మంచి చేసేల కృషి చేస్తానని హామీనిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవాలన్న సంకల్పంతో ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతం ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నపుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. గతంలో పాలించిన పార్టీ ఒక కుటుంబ పార్టీ, రాచరికంతో కొనసాగిన పార్టీ , వారికి వంగి వంగి దండాలు పెట్టిన వారికే మంత్రి పదవులు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక జాతీయ పార్టీ, బడుగు బలహీన వర్గాల పార్టీ అని ఆయన గుర్తు చేశారు. కరెంటు గురించి మాట్లాడే అర్హత ఏ పార్టీకి లేదని, కాంగ్రెస్ అంటేనే కరెంటు, కరెంటు అంటేనే కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. రైతు రుణమాఫీ కొంతమంది రైతులకు ఇవ్వవలసి ఉంది అది నిజమని అన్నారు. డబల్ బెడ్ రూమ్ పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు పేదలను మోసం చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోనే ఇందిరమ్మ ఇళ్లను కట్టిస్తుందన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పేద ప్రజలు అనేక ఇబ్బందులు పాలయ్యారని విమర్శించారు. మునుగోడు నియోజకవర్గంలో ప్రతి ఎకరానికి నీరు అందించే బాధ్యత తనదేనన్నారు. ప్రభుత్వం పెట్టిన సన్న బియ్యం పథకం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది, ఎంపీ సీటు గెలిపిస్తే మంత్రి ఇస్తానని మళ్ళీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. నాకు మంత్రి పదవి ఇస్తే కిరీటం కాదు అది ఒక బాధ్యతగా వ్యవహరిస్తానన్నారు. నాలాంటి వ్యక్తి మంత్రి పదవి ఇవ్వాలని పదేపదే అడుగుతుంటే చాలా బాధేస్తుందన్నారు. ఒకాయన అంటాడు ఒక ఇంట్లో ఇద్దరి కి మంత్రి పదవులు ఇస్తారా అని.. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రికెట్లో 11 మందిలో యూసుఫ్ పటాన్, ఇర్ఫాన్ పటాన్ అనే ఇద్దరు అన్నదమ్ములు ప్రాతినిధ్యం వహిస్తే లేనిది మంత్రి పదవులు ఇద్దరు చేస్తే తప్పా అని అన్నారు. మంత్రి పదవి అనేది అడుక్కుంటే వచ్చేది కాదు అని కెపాసిటి ని బట్టి వస్తుందన్నారు. 30 ఏళ్లు మంత్రి పదవి అనుభవించిన జానారెడ్డి కి ఈరోజు రంగారెడ్డి, హైదరాబాద్ కు మంత్రి పదవి ఇవ్వాలని గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. హైదరాబాద్, మహబూబ్ నగర్, మెదక్ లాంటి జిల్లాల్లో మంత్రుల కు ఇన్చార్జి బాధ్యతలు ఇచ్చిన ఎంపి లు గెలవలేదు, భువనగిరి లో ఒక ఎమ్మెల్యేగా నేను గెలిపించానని గుర్తుచేశారు. కెసిఆర్ ను గద్ద దింపాలనే లక్ష్యంతోనే కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి కెసిఆర్ ను గద్దె దింపిన అని అది నా కమిట్మెంట్ అన్నారు. నా మంత్రి పదవి విషయంలో కొందరు దుర్మార్గులు జానా రెడ్డి లాంటి వ్యక్తులు ధృతరాష్ట్ర పాత్ర పోషిస్తున్నారన్నారు. రాజగోపాల్ రెడ్డి అంటే గల్ల ఎగరేసుకొని ఉంటాడే తప్పా అడుక్కునే పొజిషన్లో ఎప్పటికి ఉండదని హాట్ కామెంట్స్ చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మునుగోడు ఎన్నికల ఇన్చార్జ్ పబ్బు రాజు గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ తాడూరు వెంకటరెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, మండల అధ్యక్షులు బోయ దేవేందర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం గౌడ్, మాజీ కౌన్సిలర్లు కామిశెట్టి శైలజాభాస్కర్, కొయ్యడ సైదులు గౌడ్, సందగళ్ళ విజయ సతీష్ గౌడ్, కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, బాబా షరీఫ్, శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, మోగుదాల రమేష్ గౌడ్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# భారత్‌కు రజతం

## ఆర్చరీ ప్రపంచకప్

ఫ్లోరిడా (అమెరికా): ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-1లో భారత్ ఖాతాలో మరో పతకం చేరింది. ఆదివారం ఇక్కడ జరిగిన పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ రజతం గెలుచుకుంది. ఫైనల్ పోరులో ధీరజ్, తరుణ్‌దీప్, అతాను దాస్‌తో కూడిన భారత్.. 1-5తో చైనా చేతిలో పరాజయం పాలైంది. తొలి సెట్‌లో తలా 54 పాయింట్లతో సమంగా నిలిచినప్పటికీ భారత త్రయం తర్వాత తడబాటుకు గురైంది. ఇదే టోర్నీలో మెన్స్ కాంపౌండ్ విభాగంలో కాంస్య పోరులో బరిలోకి దిగిన అభిషేక్.. స్వల్ప తేడాతో ఓడి పతకం కోల్పోయాడు.

# బెంగళూరు ధనాధన్..



## మెరిసిన సాల్ట్, కోహ్లీ

## రాజస్థాన్‌కు మరో ఓటమి

## జైస్వాల్ పోరాటం వృథా

జైపూర్: 'రాయల్స్' పోరులో బెంగళూరుదే పైచేయి అయింది. రాజస్థాన్ రాయల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మధ్య ఆదివారం జైపూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి తిరిగి గెలుపు బాట పట్టింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (33 బంతుల్లో 65, 5 ఫోర్లు, 6 సిక్సర్లు) మెరుపులకు తోడు విరాట్ కోహ్లీ (45 బంతుల్లో 62 నాటౌట్, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) స్ఫూర్తిదాయక ఇన్నింగ్స్‌తో 176 పరుగుల ఛేదనను ఆ జట్టు 17.3 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్.. యశస్వి జైస్వాల్ (47 బంతుల్లో 75, 10 ఫోర్లు, 2 సిక్సర్లు), ధ్రువ్ జురెల్ (35) రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 173/4 స్కోరు చేసింది. సాల్ట్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది. ఈ సీజన్‌లో ఆడిన ఆరు మ్యాచ్‌లలో బెంగళూరుకు ఇది నాలుగో విజయం. కాగా ఈ 4 ప్రత్యర్థుల గడ్డపై సాధించినవే కావడం విశేషం.

**ఛే'దంచేశారు'**

ఈ మ్యాచ్‌లో గ్రీన్ జెర్సీలతో బరిలోకి దిగిన బెంగళూరు.. లక్ష్యాన్ని ఛేదించడానికి పెద్దగా కష్టపడలేదు. విధ్వంసకర ఓపెనర్ సాల్ట్.. ఎప్పటిలాగే ఆరంభం నుంచే దంచుడు మంత్రాన్ని జపించగా కోహ్లీ ఆరంభంలో అతడికి అండగా నిలిచి తర్వాత గెలుపు బాధ్యతలను తన భుజాన వేసుకున్నాడు. జోఫ్రా ఆర్చర్ తొలి ఓవర్లోనే 4, 6తో ఛేదనను ప్రారంభించిన సాల్ట్.. అతడి మరుసటి ఓవర్లోనూ అదే సీన్‌ను రిపీట్ చేశాడు. ఆ తర్వాత తీక్షణ, సందీప్ బౌలింగ్‌లోనూ ఇదే కథ పునరావృతమవడంతో బెంగళూరు పవర్ ప్లేలో వికెట్ నష్టపోకుండా 65 పరుగులు చేసింది. హసరంగ ఓవర్లో బౌండరీతో 28 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన సాల్ట్ కార్తికేయ 9వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయి జైస్వాల్‌కు చిక్కడంతో 94 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. సాల్ట్ నిష్క్రమించినా బెంగళూరు ఇబ్బందిపడలేదు. అప్పటికే లక్ష్యంలో సగం దంచేసిన ఆర్‌సీబీ.. అదే దూకుడును కొనసాగించింది. పడిక్కల్ (40 నాటౌట్)తో జతకలిసిన కోహ్లీ.. హసరంగ బౌలింగ్‌లో లాంగాన్ మీదుగా సిక్సర్ బాది ఈ సీజన్‌లో మూడో హాఫ్ సెంచరీని నమోదుచేశాడు. టీ20లలో అతడికి ఇది వందో అర్ధ శతకం. పడిక్కల్ సైతం ధాటిగా ఆడి లాంఛనాన్ని పూర్తిచేశాడు.

**రాయల్స్ కట్టడి**

బెంగళూరు బ్యాటర్లు అలవోకగా దంచేసిన జైపూర్ పిచ్‌పై రాజస్థాన్ మాత్రం ధాటిగా ఆడలేకపోయింది. బౌలర్లు ఆరంభం నుంచే కట్టడి చేయడంతో సొంత వేదికపై రాజస్థాన్ తడబడింది. మొదట్నుంచే బౌలర్లపై విరుచుకుపడే జైస్వాల్, కెప్టెన్ శాంసన్ (15) క్రీజులో ఉన్నా పవర్ ప్లేలో ఆ జట్టు చేసిన స్కోరు 45 పరుగులే. అందులోనూ శాంసన్.. 16 బంతుల్లో చేసింది 13 పరుగులే. ఏడో ఓవర్లో బౌలింగ్ మార్పుగా వచ్చిన కృనాల్.. శాంసన్‌ను బోల్తా కొట్టించడంతో ఆ జట్టు తొలి వికెట్ కోల్పోయింది. అయితే పరాగ్ (30) రాకతో స్కోరు వేగం పుంజుకుంది. కృనాల్, సుయాశ్ బౌలింగ్‌లో మంచి షాట్లు ఆడిన పరాగ్.. దయాల్ 14వ ఓవర్లో కోహ్లీకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. 39 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసిన జైస్వాల్.. హాజిల్‌వుడ్ 16వ ఓవర్లో 6, 4తో గేర్ మార్చినట్టే అనిపించినా అదే ఓవర్ ఆఖరి బంతికి వికెట్ల ముందు దొరికిపోయాడు. ఆఖర్లో జురెల్ వేగంగా ఆడినా హెట్‌మెయర్ బ్యాట్ ఝుళిపించకపోవడంతో రాజస్థాన్ మోస్తరు స్కోరుకే పరిమితమైంది.

**సంక్షిప్త స్కోర్లు**

**రాజస్థాన్:** 20 ఓవర్లలో 173/4 (జైస్వాల్ 75, జురెల్ 35, హాజిల్‌వుడ్ 1/26, కృనాల్ 1/29)బీ

**బెంగళూరు:** 17.3 ఓవర్లలో 175/1 (సాల్ట్ 65, కోహ్లీ 62ని, కార్తికేయ 1/25)



# ఢిల్లీకి షాక్..

## రాణించిన తిలక్ వర్మ

## ఉత్కంఠ పోరులో ముంబై సూపర్ విక్టరీ

ఢిల్లీ: ఐపీఎల్-18లో ఓటమన్నదే లేకుండా సాగుతున్న ఢిల్లీ క్యాపిటల్స్‌కు సీజన్‌లో తొలి షాక్. ఆదివారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్‌తో ఆద్యంతం ఉత్కంఠగా సాగిన హైస్కోరింగ్ థ్రిల్లర్‌లో ఆ జట్టు 12 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ముంబై.. నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. తిలక్ వర్మ (33 బంతుల్లో 59, 6 ఫోర్లు, 3 సిక్సర్లు), రికెల్టన్ (41), సూర్యకుమార్ యాదవ్ (40) రాణించారు. ఛేదనలో ఢిల్లీ లక్ష్యానికి దగ్గరిదాకా వచ్చినా.. 19 ఓవర్లలో 195 పరుగుల వద్దే ఆగిపోయింది. కరుణ్ నాయర్ (40 బంతుల్లో 89, 12 ఫోర్లు, 5 సిక్సర్లు), పొరెల్ (25 బంతుల్లో 33) పోరాడినా ఆఖర్లో ముంబై బౌలర్లు రాణించడంతో క్యాపిటల్స్‌కు తొలి ఓటమి తప్పలేదు.

**వారెవ్వా కరుణ్**

భారీ ఛేదనలో తొలి బంతికే మెక్‌గర్క్ డకౌట్‌గా వెనుదిరిగినా ముకేశ్ కుమార్ స్థానంలో ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన నాయర్.. బౌల్ట్ రెండో ఓవర్లో 3 బౌండరీలు బాది తన ఉద్దేశాన్ని ఘనంగా చాటాడు. బుమ్రా సైతం కరుణ్ బాదుడుకు బాధితుడిగా మిగిలాడు. బుమ్రా బౌలింగ్‌లో అతడు 4, 4, 6, 4, 6 బాది 22 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. ఏడేండ్ల తర్వాత ఐపీఎల్‌లో అతడికిదే తొలి అర్ధశతకం. అతడిని ఔట్ చేసేందుకు హార్దిక్ పదే పదే బౌలర్లను మార్చినా బంతిని అందుకున్న ప్రతి ఒక్కరూ కరుణ్ బాధితులుగానే మిగిలారు. అయితే శతకానికి సమీపిస్తున్న తరుణంలో శాంట్నర్ 12వ ఓవర్లో అతడు క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఇక్కడే మ్యాచ్ ముంబై వైపు మలుపు తిరిగింది. రోహిత్ స్థానంలో ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన కర్ణ్ శర్మ.. పొరెల్, స్టబ్స్ (1), రాహుల్ (15)ను ఔట్ చేసి ముంబైని గెలుపు రేసులోకి తెచ్చాడు. ఆ తర్వాత ముంబై బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఢిల్లీకి తొలి ఓటమి ఎదురైంది.

సమిష్టిగా బాదారు

గత మ్యాచ్‌లతో పోలిస్తే ముంబై బ్యాటర్లు సమిష్టిగానే రాణించారు. రోహిత్ (18) మరోసారి నిరాశపరిచినా రికెల్టన్‌తో కలిసి తొలి వికెట్‌కు 5 ఓవర్లలోనే 47 పరుగులు జోడించడంతో ముంబైకి శుభారంభమే లభించింది. దూకుడుగా ఆడిన రికెల్టన్‌ను కుల్‌దీప్ 8వ ఓవర్లో క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన తిలక్‌తో కలిసి సూర్య ముంబైని నడిపించాడు. ఎదుర్కొన్న తొలి బంతినే బౌండరీగా మలిచిన తిలక్.. క్రీజులో ఉన్నంతసేపు అదే జోరును కొనసాగించాడు. విప్రాజ్ 13వ ఓవర్లో 6,4 బాదిన సూర్య సైతం కుల్‌దీప్ 14వ ఓవర్లో స్టార్క్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ వెంటనే హార్దిక్ (2) కూడా నిష్క్రమించినా అప్పటికే క్రీజులో కుదురుకున్న తిలక్.. నమన్ ధీర్ (38ని)తో కలిసి ముంబైకి భారీస్కోరును అందించాడు.

**సంక్షిప్త స్కోర్లు**

**ముంబై:** 20 ఓవర్లలో 205/5 (తిలక్ 59, రికెల్టన్ 41, కుల్‌దీప్ 2/23, విప్రాజ్ 2/41)బీ

**ఢిల్లీ:** 19 ఓవర్లలో 193 (కరుణ్ 89, పొరెల్ 33, కర్ణ్ 3/36, శాంట్నర్ 2/43)

# చెన్నై కోలుకునేనా!

## నేడు లక్నో సూపర్ జెయింట్స్‌తో ఢీ

లక్నో: వరుస పరాజయాలతో సతమతమవుతున్న చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టు... 'హ్యాట్రిక్' విజయాలతో జోరు మీదున్న లక్నో సూపర్ జెయింట్స్‌తో పోరుకు సిద్ధమైంది. ఐపీఎల్ 18వ సీజన్‌లో 6 మ్యాచ్‌లు ఆడిన చెన్నై సూపర్ కింగ్స్ తొలి పోరులో గెలుపొందగా... ఆ తర్వాత వరుసగా ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ ఓడింది. ఐదుసార్లు ఐపీఎల్ ట్రోఫీ చేజిక్కించుకొని లీగ్‌లోనే అత్యంత విజయవంతమైన జట్టుగా గుర్తింపు పొందిన చెన్నై... తిరిగి గెలుపు బాట పట్టాలని భావిస్తోంది. గాయం కారణంగా రెగ్యులర్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ టోర్నీకి దూరం కాగా... గత మ్యాచ్‌లోనే 'మాస్టర్ మైండ్'



మహేంద్రసింగ్ ధోని జట్టు పగ్గాలు చేపట్టాడు. అయితే పరాజయాలతో డీలా పడ్డ జట్టును అతడి సారథ్యం కూడా గట్టెక్కించలేకపోయింది. కోల్‌కతాతో జరిగిన పోరులో బ్యాటర్లంతా మూకుమ్మడిగా విఫలం కావడంతో చెన్నై ఘోర పరాజయం మూటగట్టుకుంది. వాటన్నింటిని పక్కన పెట్టి తిరిగి సత్తా చాటాలని ధోనీ సేన భావిస్తోంది. మరోవైపు రిషబ్ పంత్ సారథ్యంలోని లక్నో సూపర్ జెయింట్స్ జట్టు సీజన్‌లో 6 మ్యాచ్‌లాడి 4 విజయాలు, 2 పరాజయాలు నమోదు చేసుకుంది. గత మూడు మ్యాచ్‌ల్లో మాజీ చాంపియన్లు ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, గుజరాత్ టైటాన్స్‌లపై గెలిచి లక్నో ఫుల్ జోష్‌లో ఉంది. మరి లక్నో జోరును అడ్డుకొని చెన్నై విజయాల బాట పడుతుందా చూడాలి!

**హిట్టర్లతో దట్టంగా...**

గత మూడు మ్యాచ్‌ల్లోనూ పవర్‌ప్లే వికెట్లు కోల్పోని లక్నో జట్టు... హిట్టర్లతో దట్టంగా ఉంది. వ్యక్తిగత కారణాల వల్ల గుజరాత్‌తో మ్యాచ్‌కు అందుబాటులో లేని మిచెల్ మార్ష్... చెన్నైతో పోరులో బరిలోకి దిగడం ఖాయమే.

GHMC
hmda
Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595



# పుత్తడి ఏ 92,150
# చారిత్రక గరిష్ఠ స్థాయికి ధర

## రూ.1,100 పెరిగిన తులం విలువ

న్యూఢిల్లీ, మార్చి 28: బంగారం ధరలు భగభగమండుతున్నాయి. ఇప్పటికే సామాన్యుడికి అందని స్థాయికి చేరుకున్న పుత్తడి విలువ మరో చారిత్రక గరిష్ఠ స్థాయికి ఎగబాకింది. వరుసగా పెరుగుతూ వచ్చిన బంగారం ధర రూ.92 వేల మైలురాయిని అధిగమించింది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ నెలకొనడంతోపాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతులపై సుంకాలను పెంచుతూ తీసుకున్న నిర్ణయం మదుపరుల్లో ఆందోళనను పెంచింది. ఫలితంగా తమ పెట్టుబడులను ఈక్విటీ మార్కెట్ల నుంచి సురక్షితమైన బంగారం వైపు మళ్లించడంతో వీటి ధరలు రికార్డు స్థాయిలో ఎగబాకాయి. ఇదే క్రమంలో దేశ రాజధాని న్యూఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర శుక్రవారం ఒకేరోజు రూ.1,100 ఎగబాకి రూ.92,150 పలికింది. ఈ విషయాన్ని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. గురువారం ఈ ధర రూ.91,050గా ఉన్నది.

అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.1,100 అధికమై చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.91,700కి చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లోనూ గోల్డ్ ధరలు భారీగా పెరిగాయి. 24 క్యారెట్ పదిగ్రాముల బంగారం ధర రూ.1,140 ఎగబాకి రూ.90,980కి చేరుకోగా, 22 క్యారెట్ ధర రూ.1,050 అధికమై రూ.83,400 పలికింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బంగారం ధర రూ.23,730 లేదా 35 శాతం ఎగబాకింది. గతేడాది ఏప్రిల్ 1న తులం ధర రూ.68,420గా ఉన్నది.

**పుత్తడి బాటలోనే వెండి**

వెండి ధరలు భారీగా పెరిగాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి రూ.1,300 అందుకొని రూ. 1,03,000కి చేరుకున్నది. అంతర్జాతీయ దేశాల మధ్య వాణిజ్య యుద్ధ భయాలు నెలకొనడం, ఆర్థికాభివృద్ధికి సంబంధించిన చిక్కులు ఎదురుకావడం బంగారం ధరలు రివ్వున ఎగరడానికి ప్రధాన కారణాలని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ విశ్లేషకుడు సౌమిల్ గాంధీ తెలిపారు.



## భారత్ కోసం రెండు జపనీస్ బ్రాండ్ కార్లు




ఇండియన్ మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన కంపెనీలలో ఒకటైన 'నిస్సాన్' మరో రెండు కార్లను లాంచ్ చేయడానికి సన్నద్ధమవుతోంది. ఇందులో ఒకటి 5 సీటర్, మరొకటి 7 సీటర్. వీటిని కంపెనీ 2026లో దేశీయ విఫణిలోకి ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది.జపాన్‌లోని యోకోహామాలో ఇటీవల ముగిసిన గ్లోబల్ ప్రొడక్ట్ షోకేస్ ఈవెంట్‌లో నిస్సాన్ కంపెనీ భారతదేశం కోసం తీసుకురానున్న రెండు కొత్త ఉత్పత్తులను ప్రదర్శించింది. దీన్ని బట్టి చూస్తే.. ఇండియన్ మార్కెట్లో తన హవా కొనసాగించడానికి సంస్థ తయారవుతున్నట్లు తెలుస్తోంది. నిస్సాన్ కంపెనీ ఈ రెండు కార్లను భారతదేశంలో అధికారికంగా 2026లో ప్రారంభించనుంది. ఇవి రెండూ.. ఇప్పుడున్న బ్రాండ్ మోడల్స్ కంటే భిన్నంగా.. ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చే విధంగా ఉంటాయని తెలుస్తోంది. కాగా ఈ కార్లకు సంబంధించిన చాలా వివరాలు వెల్లడికావాల్సి ఉంది. అయితే వీటిని కంపెనీ ప్రత్యేకించి ఇండియన్ మార్కెట్ కోసం డిజైన్ చేస్తోంది, కాబట్టి ఇవి వాహన వినియోగదారులకు చాలా అనుకూలంగా ఉంటాయని తెలుస్తోంది.ప్రస్తుతం ఇండియన్ మార్కెట్లో నిస్సాన్ కేవలం ఒక కారును (మాగ్నైట్) మాత్రమే విక్రయిస్తోంది. ఇది ప్రారంభం నుంచి 1.70 లక్షల కంటే ఎక్కువ సేల్స్ పొందింది. దీని ధర రూ. 6.14 లక్షల నుంచి రూ. 11.92 లక్షల (ఎక్స్ షోరూమ్) మధ్య ఉంది. డిజైన్, ఫీచర్స్ అద్భుతంగా ఉన్నాయి. పనితీరు కూడా ఉత్తమంగా ఉంటుంది.

## కోడింగ్‌లో కృత్రిమమేధ ఏం చేస్తుందంటే..

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకుస్తోంది. కోడింగ్ ప్రక్రియలో సృజనాత్మకతను, సామర్థ్యాన్ని సమకూరుస్తోంది. కోడింగ్‌లో ఏఐ నిర్వహిస్తున్న కొన్ని అంశాలను సాంకేతిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.కోడ్ జనరేషన్: గిట్‌హబ్ లాంటి కోపిలాట్ కృత్రిమ మేధ ఆధారిత సాధనాలు నేచరల్ ల్యాంగ్వేజీ వివరణల ఆధారంగా కోడ్ స్నిప్పెట్లు, ఫంక్షన్లు, మాడ్యూల్స్‌ను తయారు చేస్తుంది. ఇది మాన్యువల్ కోడింగ్‌ను తగ్గించి సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌ను వేగవంతం చేస్తుంది.బగ్ డిటెక్షన్: ఏఐ అల్గారిథమ్స్ నమూనాలను విశ్లేషించడం ద్వారా కోడ్‌లో బగ్స్, సమస్యలను గుర్తిస్తున్నారు. ఈ టూల్స్ రియల్ టైమ్ ఫీడ్ బ్యాక్‌ను అందిస్తాయి.కోడ్ ఆప్టిమైజేషన్: ఏఐ ఇప్పటికే ఉన్న కోడ్‌ను విశ్లేషించగలదు. పనితీరు, రీడబిలిటీ, నిర్వహణను మెరుగుపరచడానికి ఆప్టిమైజేషన్‌లను సూచిస్తుంది. ఇది వనరులను సమర్థవంతంగా ఉపయోగించడానికి, మెరుగైన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించడానికి సాయం చేస్తుంది.

**టెస్టింగ్:** టెస్ట్ కేసులను జనరేట్ చేయడం, ఎడ్జ్ కేసులను గుర్తించడం, పునరావృత టెస్టింగ్ పనులను ఆటోమేట్ చేయడం ద్వారా ఏఐ టెస్టింగ్ ప్రక్రియను క్రమబద్ధీకరిస్తుంది.కోడ్ రివ్యూ అసిస్టెన్స్: ఏఐ ఆధారిత కోడ్ రివ్యూ టూల్స్ పీర్ రివ్యూల సమయంలో కోడ్‌ను మెరుగుపరచడానికి, కోడింగ్ ప్రమాణాలు, ఉత్తమ పద్ధతులకు కట్టుబడి ఉండేలా చూడటానికి సూచనలను అందిస్తాయి.

డీబగ్గింగ్ సపోర్ట్: కోడింగ్‌లో సమస్యలకు మూలకారణాన్ని గుర్తించడం, సంభావ్య పరిష్కారాలను సూచించడం ద్వారా డీబగ్గింగ్ చేయడంలో ఏఐ టూల్స్ డెవలపర్లకు సహాయపడతాయి. ట్రబుల్ షూటింగ్ కోసం వెచ్చించే సమయాన్ని తగ్గిస్తాయి.

## టెలీ కాలింగ్ ఉద్యోగాల బూమింగ్

### 2024లో 34 శాతం పెరిగిన అవకాశాలు
### బిజినెస్ డెవలప్‌మెంట్ ఉద్యోగాలకూ డిమాండ్
### జాబ్‌సైట్ వర్క్ఇండియా నివేదిక



ముంబై: టెలీ కాలింగ్, బిజినెస్ డెవలప్‌మెంట్ తదితర ఆధునిక విక్రయ విభాగాల్లో గతేడాది 34 శాతం అధిక ఉపాధి అవకాశాలు లభించినట్టు జాబ్‌పోర్టల్ 'వర్క్ ఇండియా' నివేదిక వెల్లడించింది. సేల్స్ ఉద్యోగ మార్కెట్ భారత్‌లో మార్పును చూస్తున్నట్టు తెలిపింది. ఈ నివేదిక ప్రకారం.. 2023తో పోల్చితే ఈ విభాగంలో 2024లో జాబ్ పోస్టింగ్‌లు 17 శాతం పెరిగాయి. సంప్రదాయ మార్గాల కంటే కొత్త తరహా డిజిటల్ ఛానళ్లపైనే కంపెనీలు ఎక్కువగా దృష్టి సారిస్తున్నాయి. ఇలా ఆధునిక విక్రయ ఛానళ్లలో టెలీకాలింగ్, బిజినెస్ డెవలప్‌మెంట్‌లో గతేడాది ఉపాధి అవకాశాలు అంతకుముందు ఏడాదితో పోల్చితే గణనీయంగా (34 శాతం) పెరిగాయి. సంప్రదాయ సేల్స్ ఉద్యోగాలైన రిటైల్, ఫీల్డ్ సేల్స్ ఉద్యోగాలు మాత్రం అంతకుముందు ఏడాదితో పోల్చితే 2 శాతం తగ్గాయి. 2023, 2024 సంవత్సరాల్లో తన ప్లాట్‌ఫామ్‌పై నమోదైన 12.8 లక్షల జాబ్ పోస్టింగ్‌ల డేటా ఆధారంగా ఈ వివరాలను వర్క్ఇండియా విడుదల చేసింది. అన్నింటిలోకి టెలీకాలర్ ఉద్యోగాలకు బూమింగ్ వాతావరణం ఉన్నట్టు ఈ నివేదిక ఆధారంగా తెలుస్తోంది. ఎందుకంటే 2023లో టెలీకాలర్ ఉద్యోగాలకు ఎక్కువ పోస్టింగ్‌లు నమోదు కాగా, 2024లోనూ అదే వాతావరణం కొనసాగింది. 22 శాతం అధికంగా టెలీకాలర్ జాబ్ పోస్టింగ్‌లు వర్క్ఇండియాపై లిస్ట్ అయ్యాయి. బిజినెస్ డెవలప్‌మెంట్ జాబ్‌లకు ఏకంగా 80 శాతం అధిక పోస్టింగ్‌లు వచ్చాయి.

**మహిళలకు ప్రాధాన్యం..**

టెలీకాలర్ ఉద్యోగాల్లో మహిళల నియామకాలు గణనీయంగా పెరిగాయి. 2024లో టెలీకాలింగ్, బిజినెస్ డెవలప్‌మెంట్‌లో మహిళల నియామకం 2023తో పోల్చితే 80 శాతం పెరిగినట్టు ఈ నివేదిక వెల్లడించింది. సేల్స్‌లో మహిళలకు పెరుగుతున్న ప్రాతినిధ్యాన్ని సూచిస్తున్నట్టు తెలిపింది.

**సేల్స్‌లో మార్పులు..**

అమ్మకాల విషయంలో కంపెనీల్లో వస్తున్న మార్పును ఈ గణాంకాలు ప్రతిఫలిస్తున్నట్టు వర్క్ఇండియా నివేదిక తెలిపింది. అదే సమయంలో సంప్రదాయ సేల్స్ ఉద్యోగాలకు తగ్గడాన్ని ప్రస్తావించింది. టైర్, 3, 4 పట్టణాల మినహా మిగిలిన చోట సంప్రదాయ సేల్స్ ఉద్యోగాల పోస్టింగ్‌లు తగ్గినట్టు తెలిపింది.




## 5జీ విస్తరణపై నోకియా నివేదిక.. కీలకాంశాలు..

దేశంలో వివిధ టెలికాం సంస్థలు 5జీ నెట్‌వర్క్ పరిధిని విస్తరిస్తున్నాయి. ఇందుకోసం అవసరమయ్యే మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఇటీవల విడుదలైన 'నోకియా 2024 మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ ఇండెక్స్ రిపోర్ట్' దేశీయ 5జీ నెట్‌వర్క్ విస్తరణను విశ్లేషించింది. దేశవ్యాప్తంగా మెరుగవుతున్న టెలికాం కనెక్టివిటీని ఈ నివేదిక హైలైట్ చేసింది. అందులోకి కీలక అంశాలు కింది విధంగా ఉన్నాయి. 2024లోనే 5జీ డేటా ట్రాఫిక్ మూడు రెట్లు పెరగడం గమనార్హం. మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ వాడకంలో 5జీ నెట్‌వర్క్ ప్రస్తుతం 43% వాటాను కలిగి ఉంది. 2023 నుంచి ఈ వాటా దాదాపు రెట్టింపు అయింది. 2024లో ప్రతి వినియోగదారుడి సగటు నెలవారీ డేటా వినియోగం 27.5 జీబీకి చేరుకుంది. గత ఐదేళ్లలో 19.5% సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) చొప్పున ఈ వినియోగం పెరిగింది. స్మార్ట్‌ఫోన్లు పెరగడం, మెరుగైన ఇంటర్నెట్ సేవలు, డిజిటల్ కంటెంట్ వ్యాప్తి ఈ పెరుగుదలకు కారణమవుతున్నాయి.

**నెట్‌వర్క్ వ్యవస్థ విస్తరణ**

దేశంలో 5జీ ఎకోసిస్టమ్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. అందుకు కావాల్సిన పరికరాలు, మౌలిక సదుపాయాలు రెట్టింపు అవుతున్నాయి. 2025 నాటికి దేశంలో దాదాపు 90% స్మార్ట్‌ఫోన్లు 5జీ సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని అంచనా. దేశంలో యాక్టివ్ 5జీ డివైజ్‌ల సంఖ్య 2024 నాటికి రెట్టింపై 271 మిలియన్లకు చేరుకుంది. తదుపరితరం వినియోగదారులు అధునాతన కనెక్టివిటీ కోసం సిద్ధంగా ఉంటారని ఇది నిర్ధారిస్తుంది.

హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందించడంలో ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ (ఎఫ్‌డబ్ల్యూఏ) టెక్నాలజీకి పెరుగుతున్న ఆదరణను ఈ నివేదిక ఎత్తిచూపింది. 5జీ ఎఫ్‌డబ్ల్యూఏ వినియోగదారులు సగటు మొబైల్ వినియోగదారుల కంటే 12 రెట్లు ఎక్కువ డేటాను వినియోగించారు. ఇది వెనుకబడిన ప్రాంతాల్లో కనెక్టివిటీ సవాళ్లను పరిష్కరించే సామర్థ్యాన్ని నొక్కి చెబుతుంది. మొత్తం 5జీ డేటా ట్రాఫిక్ 2026 ప్రారంభం నాటికి ప్రస్తుత 4జీ ట్రాఫిక్‌ను మించిపోతుందని నివేదిక అంచనా వేసింది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.